క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

కొల్లిపర: మండల పరిధిలోని దంతలూరు గ్రామంలో మరియమ్మ మహిళ ఇంటి వెనుక గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 9 క్వింటాల 61 కేజీల రేషన్ బియ్యం బుధవారం గుర్తించినట్లు తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియమ్మ తన బంధువులు ఇంటికి వెళ్లి రెండు రోజులు తరువాత ఇంటికి వచ్చే సమయానికి ఇంటి వెనుక భాగంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వెంటనే స్థానిక వీఆర్ఏ, వీఆర్వోకి సమాచారం అందించటంతో వెంటనే అధికారులు స్వాధీనం చేసుకొని గ్రామంలో విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు విడుదల

తెనాలి: స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో నియోజకవర్గంలోని కొల్లిపరలో గల శ్రీగంగాపార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం జరగనుంది. ఈ మేరకు జనసేన స్థానిక పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.1.5 కోట్ల నిధులు సమీకరించగా, అందులో దేవదాయశాఖ నుంచి రూ. కోటి నిధులు విడుదలయ్యాయి. గ్రామస్తులు రూ.50 లక్షల విరాళం అందజేసినట్లు తెలిపారు.

దేవికారాణికి కవితా పురస్కారం

9న ఖమ్మంలో ప్రదానం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి రాసిన 'అద్భుతం' కవితకు జాతీయ కవితల పోటీల్లో పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని సాహితీ సంస్థ 'అక్షరాల తోవ' ఇటీవల అద్భుతం అనే అంశంపై జాతీయ కవితల పోటీలను నిర్వహించారు. ఇందులో దేవికారాణి కవిత కవితా పురస్కారానికి ఎంపికైంది. ఈనెల 9వ తేదీన ఖమ్మంలోని జడ్పీ మీటింగ్ హాలులో జరిగే బహుమతి ప్రదానోత్సవంలో కవితా పురస్కారాన్ని బహూకరిస్తారు. స్థానిక జయప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కొలకలూరి దేవికారాణి, రూరల్ మండలం కొలకలూరులోని జిల్లాపరిషత్ హైస్కూలులో ఉపాధ్యాయినిగా చేస్తున్నారు. ప్రవృత్తి కవితా రచన. కవితల పోటీల్లో పలుసార్లు రాష్ట్రస్థాయి బహుమతులను స్వీకరించారు. ఆమె రచించిన 106 కవితలతో తీసుకొచ్చిన 'స్వప్న వేణువు' కవితా సంపుటిని గత నెలలో తెనాలిలో ఆవిష్కరించారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని 7,8 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలపై ఎటువంటి రాళ్లు వేయవద్దని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ నాజరుపేటకు చెందిన గొంది బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకుదురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జూపల్లి వేణు, అతని స్నేహితుడు రాము గత నెల 31వ తేదీ రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. వేణు బసవయ్య గొంతుపై కత్తితో పొడిచాడు. బబాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులపై చర్యలు తీసుకోవాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఆలయం పుననిర్మాణానికి నిధులు మంజూరు

కొల్లిపర: మండల కేంద్ర మైన కొల్లిపర గ్రామంలో శ్రీ గంగాపార్వతీ ముక్తేశ్వరస్వామి ఆలయం సుమారు 1500 సంవత్సరాల పూర్వం వేంగి రాజులు నిర్మించగా అప్పటి నుండి స్వామి వారికి నిత్యం పూజలు జరుగుతుఉన్నాయి. పూర్వకాలంలో ఆలయం నిర్మించటంతో ఆలయం భక్తుల కోరిక మేరకు పుననిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు.దీంతో ప్రజలు ప్రభుత్వం, దేవాదాయశాఖను నిధులు కోరగా ప్రభుత్వం స్పందించి కోటి రూపాయలు నిధులు మంజూరు చేయగా, గ్రామస్తులు రూ.50 లక్షలు దేవాలయం పేరు పై బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ నిధులతో త్వరలో ఆలయం పుననిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆలయం ధర్మకర్త, అర్చకులు తెలుపుతున్నారు.

తెనాలి వాసి ప్రజ్ఞానంద సరస్వతికి పీఠాధిపత్యం

- అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా అరుదైన అవకాశం
- 6,7,8 తేదీల్లో పీఠాధిరోహణ, పట్టాభిషేక మహోత్సవాలు



శ్రీసాలిగ్రామం ట్రస్ట్ బాధ్యులతో

తెనాలి: ఆర్యవైశ్య కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలమైన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని అఖిలభారత శ్రీ వాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) పీఠాధిపత్యం స్వీకరించనున్నారు. ఈనెల 6,7,8 తేదీల్లో పీఠాధిరోహణ, పట్టాభిషేక మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. పెనుగొండ క్షేత్ర వాసవీ శాంతిధామంలో 8వ తేదీన భీష్మ ఏకాదశి రోజున ఉదయం 11.27 గంటలకు పీఠాధిరోహణ మహోత్సవం, అనంతరం అనుగ్రహ భాషణ ఉంటాయి. ఈ సందర్భంగా తెనాలికి చెందిన శ్రీప్రజ్ఞానంద సరస్వతి పరిచయమిది.

పట్టణంలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం స్థాపకులు శ్రీప్రజ్ఞానంద సరస్వతి స్వామి. ఇక్కడే స్వామి ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైంది. తమ బాల్యంలోనే ఆధ్యాత్మికతపై ఎంతో అవగాహన పొందారు. చిన్నతనంలోనే సన్యాస దీక్ష పొందిన కారణంగా భక్తులు, సన్నిహితులు బాలస్వామీజీగా పిలుచుకుంటారు. పట్టణంలోని బొలిశెట్టి నరసింహారావు, రాజ్యలక్ష్మి దంపతులకు 1989 అక్టోబరు 27న తృతీయ సంతానంగా జన్మించారు. అప్పట్లో తల్లిదండ్రులు పెట్టిన పేరు బొలిశెట్టి వెంకట ప్రదీప్ శ్రేష్ఠి. స్థానిక తాలూకా హైస్కూలులో పదోతరగతి వరకు చదివినా, శ్రీవిద్యాపీఠంలో ఎనిమిదేళ్ల వయసు నుంచే ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైంది. వేదాలు, పురాణాలు, భగవద్గీత సహా పురాణేతిహాసాలను అభ్యసించారు. ఆధ్యాత్మిక చింతనలో విశేషంగా ఆధ్యాత్మిక యోగసాధన చేసి సిద్ధి పొంది ఉన్నారు. పవిత్ర పుణ్యస్థలమైన నైమిశారణ్యంలో శ్రీ ఆనందానంద సరస్వతి స్వామీజీ చేతులమీదుగా అయిదేళ్ల క్రితం సన్యాసదీక్ష స్వీకరించారు.

స్వామీజీ పలు పుణ్యక్షేత్రాల్లో భక్తులకు అద్వైత బోధ, శంకర భాష్యం, ఉపనిషత్తుల సారాంశాలను తమ ప్రవచనాలతో తెలియజేస్తున్నారు. తెనాలిలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం, లలిత సేవాసమితి, జయలక్ష్మి మాతృమండలి వీరికి వేదికలుగా ఉన్నాయి. తెనాలి బుర్రిపాలెం రోడ్డులో శ్రీసరస్వతీ దేవాలయ నిర్మాణ సన్నాహాల్లో ఉన్నారు. మరోవైపు భారీ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో పేరుగాంచారు.

ఈ నేపథ్యంలో 16 ఏళ్ల క్రితం ప్రారంభించిన పెనుగొండ క్షేత పీఠానికి ప్రథమ పీఠాధిపతులుగా శ్రీకృష్ణానందపురి స్వామీజీ భక్తులకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించారు. పూజ్య స్వామీజీ 2024 జూన్ 29న శివైక్యం చెందారు. ఈ క్షేత్ర పీఠం పవిత్రస్థానం బాధ్యతలపై సంబంధిత ట్రస్ట్ కార్యవర్గం పలువురు సాధువులు, పండితులు, పీఠాధిపతులను సంప్రదించింది. అందరి అభిప్రాయాలను స్వీకరించిన తదుపరి పీఠాధిపతిగా శ్రీప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీని ఎంపిక చేశారు. ఈనెల 8వ తేదీన స్వామీజీ పీఠారోహణ మహోత్సవ నిర్వహణకు సాధువులు, పండితులు, పీఠాధిపతులు నిర్ణయం చేశారు. అందుకోసం బుధవారం ఉదయం స్వామీజీ, భక్తుల కోలాహలం నడుమ పెనుగొండకు తరలివెళ్లారు.

అత్యంత వైభవంగా జరగనున్న ఈ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తెనాలి, పరిసరాల్లోని భక్తులు తరలివెళుతున్నారు. శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ అధ్యక్షుడు సంబూరు వెంకట కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, కోశాధికారి గోపు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, ర ఘునాధ్ గుప్తా, పెనుగొండ వెంకటేశ్వరరావు, పోలిశెట్టి సురేష్, అద్దంకి మోహనరావు తదితరులు ఆధ్వర్యంలో వేడుకకు హాజరవుతున్నారు.

జనారణ్యంలో ఆదిమానవుడు

- సిగ్గుపడని సమాజం
- ప్రధాని కార్యాలయం దృష్టికి విషయం
- అయినా పట్టని అధికార యంత్రాంగం
- 'ఆశ్రయ' ఉన్నా ఆశ్రయం లభించేది!
- టీడీపీ హయాంలోనే మూతపడిన 'ఆశ్రయ'
- నాడు బి.వెంకటేశం కలెక్టరుగా ఏర్పడిన ఆశ్రయ
- మానసిక వికలాంగులను కంటికి రెప్పలా చూసిన కేంద్రం



జోరువర్షంలోనూ అదే ప్రదేశంలో (ఫైల్)

తెనాలి: నిజమే...ఆధునిక జనారణ్యంలో ఓ నడివయసు వ్యక్తి ఆదిమానవుడిలా బట్టలు లేకుండా గడుపుతున్నాడు. రద్దీ రోడ్డుపక్కన నగ్నశిలలా దర్శనమిస్తున్న ఆ వ్యక్తిని చూసి సమాజం ఏమాత్రం సిగ్గుపడటం లేదు. బాధ్యత అనిపించిన ఓ పౌరుడు నేరుగా ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ పంపాడు. అక్కడి నుంచి సమాచారం వచ్చింది... అయినా అధికార యంత్రాంగానికీ పట్ట లేదు. ఏం చేయాలో పాలుపోవటం లేదనిపిస్తుంది.

అగ్నిమాపక కేంద్రం, ఆ పక్కనే తహసీల్దారు కార్యాలయం, ఆ వరుసలోనే సబ్‌ట్రెజరీ, కోర్టు, రూరల్ పోలీస్‌స్టేషన్...అగ్నిమాపక కేంద్రానికి ముందూ వెనుకా సబ్‌జిస్ట్రారు కార్యాలయం, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్...ఇన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేదగ్గర ఉన్న కొత్తపేట రోడ్డు కూడలిలో ఒక పక్కగా ఓ నడివయసు వ్యక్తి దిసమొలతో దర్శనమిస్తున్నాడు. నెలల తరబడి అదేచోట నగ్నశిల్పంలా కూర్చొని ఉంటున్నాడు. శివాజీచౌక్ నుంచి దేవీచౌక్‌కు దారితీసే ఆ రోడ్డులో ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం ఎంతోమంది రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం అధికారులు అటుగానే వెళుతుంటారు. వాహనాలైతే చెప్పనవసరం లేదు. అక్కడకు దాదాపు రెండు ఫర్లాంగుల దూరంలోపే న్యాయస్థానాల సముదాయం, సబ్‌కలెక్టర్ కార్యాలయం కూడా ఉన్నాయి.

ఎవరైనా చిరిగిన దుప్పటిని ఇచ్చినా బుద్ధిమంతుడిలా కప్పుకుంటాడు. కొంత సేపటికి మళ్లీ మామూలే! అదెటుపోతుందో తెలీయదు. ఎవరైనా దయతలచి ఏదైనా పెడితే తింటాడు. యాచిస్తూ మాత్రం కనిపించడు. అప్పుడప్పుడూ అటూ ఇటూ కదులుతుంటాడు. రాత్రిపూట సమీప వీధుల్లోకి పాకుతూ వెళుతుంటాడు. ఇళ్ల ముందు పార్క్ చేసివుండే కార్ల లైట్లు, వైపర్స్, సైడ్ మిర్రర్స్‌ను ధ్వంసం చేస్తున్నాడు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

ప్రధానమంత్రి కార్యాలయానికి సమాచారం

విశ్రాంత ప్రిన్సిపాల్ ఒకరు అతడి పరిస్థితి గురించి నేరుగా ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. అక్కడి నుంచి సంబంధిత అధికారులకు సమాచారం వచ్చింది. అధికారులు ఆ విశ్రాంత ప్రిన్సిపాల్‌ను పిలిచి విచారించారు. రోడ్డుపక్కన ఆదిమ జీవిలా గడిపే వ్యక్తికి ఆసరా కల్పించే ప్రయత్నం చేయటం లేదు. తెనాలి గాంధీనగర్‌లోని తాడిబోయినవారి వీధిలో ఒకప్పుడు సొంత ఇంటిలో గౌరవంగా జీవించిన కుటుంబానికి చెందిన వ్యక్తి అతడు. పదోతరగతి వరకు చదివినట్టు తెలిసింది. మానసికంగా దెబ్బతిని, కొన్నేళ్లుగా ఇలా రోడ్డుపాలయ్యాడు. ఎర్రని ఎండలోనూ, జోరున కురిసే వర్షంలోనూ రోడ్డే ఆధారంగా రోజులు గడుపుతున్నాడు.



తాత్కాలికంగా దుప్పటిని కప్పుకున్న వ్యక్తి

'ఆశ్రయ'ం ఉంటే నీడ దొరికేదే!?

ఐఏఎస్ అధికారి బి.వెంకటేశం ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టరుగా చేసినపుడు మానసికంగా దెబ్బతిని ఇల్లొదిలి రోడ్లపై కాలం గడిపే వారికి ఆశ్రయం కల్పించి, సంస్కరించాలని తలపోశారు. అనుకున్నదే తడవుగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని ఓ విభాగాన్ని సిద్ధం చేయించారు. ఆశ్రయ కేంద్రంగా నామకరణం చేశారు. నందూరి జైరాజ్ అనే స్వచ్ఛంద సేవకుడు నిర్వహణలో అది కొనసాగింది. నిర్వహణ వ్యయాన్ని కలెక్టర్ వెంకటేశం భరించారు. భోజనం మాత్రం ఆసుపత్రి సమకూర్చేది. బదిలీపై తెలంగాణ వెళ్లినప్పటికీ డబ్బులు పంపిస్తూ వచ్చారు. దాతల సాయం కూడా అందుతూ వచ్చింది. రోడ్లపై అనాథల గురించి స్థానికులు సమాచారమిస్తే 'ఆశ్రయ'కు తీసుకెళ్లేవారు. స్నానం చేయించి, శుభ్రమైన దుస్తులు ఇచ్చి శ్రద్ధగా చూసుకునేవారు. నందూరి జైరాజ్ మరణించటంతో ఆ బాధ్యతను కొడుకు తీసుకున్నాడు. పదేళ్లకు పైగా గణనీయమైన సేవలందించిన ఆశ్రయ, టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 ప్రాంతంలోనే మూతపడింది. ఆ కేంద్రం నడిచి వుంటే రోడ్డు పక్కన గడుపుతున్న ఇతడికి తప్పక ఆశ్రయం లభించి ఉండేదేమో!

వ్యవ'సాయం'లేని కేంద్రం బడ్జెట్ ప్రతుల దహనం



అయితానగర్‌లో బడ్జెట్ ప్రతుల దహనం

తెనాలి: నూటికి 70 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగంపై కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం 2.51 శాతం నిధులు కేటాయించటాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అయితానగర్, రూరల్ మండల గ్రామం గుడివాడ సెంటర్లోనూ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. బడ్జెట్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఎనిమిదేళ్లలో లక్షా 474 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్టు చెప్పారు. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని ఆందోళన చేసినాగానీ బడ్జెట్‌లో దాని ఊసే లేకపోవడం దుర్మార్గమన్నారు. ఎరువుల సబ్సిడీలో రూ.3,412 కోట్లు కోత విధించినందున వాటి ధరలు పెరుగుతాయని చెప్పారు. ఇన్నేళ్ల మోదీ పరిపాలనలో రాష్ట్రానికి ఏం ఒరిగిందో చెప్పాలని నిలదీశారు. పాలరైతుల సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తబిత, అత్తోట సరోజిని, తెనాలి మేరిమ్మ, కూచిపూడి శకుంతల, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, తెనాలి ఝాన్సీ, లంకా రత్నం, మేకల మరియదాసు, వేజండ్ల నాగేశ్వరరావు, తెనాలి శాంతకుమారి, కొలకలూరి జార్జి, కడియాల పాల్గొన్నారు.

మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన

యువకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఓ మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలేనికి చెందిన బాలిక డాన్‌బాస్కో స్కూల్‌లో చదువుతోంది. ఈ నెల ఒకటిన సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆ బాలికను వెంబడించి అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో ఒకటో తేదీ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా, ఇతర సాక్ష్యాల ఆధారంగా నిందితుడు యర్రబాలేనికి చెందిన వెంకట్‌గా గుర్తించామని సీఐ తెలిపారు. అతను ఎయిమ్స్ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్‌లో అసిస్టెంట్‌గా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించి, మంగళగిరి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. నిందితుడిని జిల్లా జైలుకు తరలించామని తెలిపారు.సమావేశంలో యస్ఐ సీహెచ్. వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కోపల్లె-గుడివాడ గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5200 స్వాధీనం చేసుకున్నారు.

టీబీ అంతం-మనందరి పంతం కావాలి



తెనాలిఅర్బన్: టీబీ అంతం--మనందరి పంతం కావాలని టీబీ యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ పి రవికుమార్ పేర్కొన్నారు. అంగలకుదురులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్షయ వ్యాధిపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటు వ్యాధి అని గాలి ద్వారా వ్యాపించే అవకాశం ఉన్నందున అందరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం వస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో హెచ్ ఎం అనురాధ, సిబ్బంది సౌజన్య, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పునరుత్థాన పండుగల్లో పాల్గొనండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రదర్ సాల్మన్, సంఘ సభ్యులు

తెనాలిఅర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 తేదీల్లో 17వ పునరుత్థాన పండుగలు నిర్వహించనున్నట్లు బ్రదర్ సాల్మన్ తెలిపారు. అమరావతి ప్లాట్స్‌లో బుధవారం పండుగలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి ప్లాట్స్‌లోని స్టేడియం వద్ద ప్రతి రోజు మధ్యాహ్నం, రాత్రి కూడికలు జరుగుతాయని చెప్పారు. అనేక ప్రాంతాలలో దేవుని సేవలో బలంగా వాడబడుతున్న అనేక మంది దైవ సేవకులు వాక్య పరిచర్య చేసేందుకు వస్తున్నారని తెలిపారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- టౌన్ ప్లానింగ్ అధికారులతో వ్యాపారులు వాగ్వివాదం
- కమిషనర్ జోక్యంతో ముగిసిన వివాదం



బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

తెనాలిఅర్బన్: ఆక్రమణల తొలగింపులో వ్యాపారులకు మున్సిపల్ అధికారుల మధ్య వాగ్వివాదం జరిగింది. కమిషనర్ జోక్యంతో చివరకు ఆక్రమణలను తొలగించారు. వివరాలలోకి వెళ్తే... మున్సిపల్ మార్కెట్ వద్ద కొందరు వ్యాపారులు షాపుల బయట కూరగాయాలను విక్రయిస్తున్నారు. షాపులలోనే విక్రయాలు జరపాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గతంలో సూచించి వాటిని తొలగించారు. అయిన కొందరు వ్యాపారులు షాపుల బయట విక్రయాలు జరుపుతుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడకు వెళ్ళి వాటిని తొలగించాలని ఆదేశించారు. దీంతో వ్యాపారులు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వాగ్వివాదంకు దిగారు. కమిషనర్ శేషన్న అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి ఆక్రమణలు తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులో కూడా కొందరు వ్యాపారులు మురుగు కాల్వలపై మెట్లు నిర్మించటంతో వాటిని జేసీబీతో తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ టి.శివన్నారాయణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, పలువురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలు యువతకు ఆదర్శనీయం



ప్రసంగిస్తున్న కేఎల్‌యూ విద్యార్థిని

తాడేపల్లి రూరల్: భారత స్వాతంత్య్ర ఉద్యమంలో చిరస్మరణీయమైన పాత్ర పోషించిన సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమని కేఎల్‌యూ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నేతాజీ జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించారు.

విద్యార్థి విభాగాధిపతి కె.ఆర్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ నేతాజీ నిబద్ధత, ధైర్యసాహసాలతో దేశభక్తికి మారుపేరుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో బీసీఏ విభాగాధిపతి భగవాన్, అధ్యాపకులు జి.బి.వి.కిశోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి. ఉషారాణి, కో ఆర్డినేటర్ పి. సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కేఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెల్లంకి శ్రీదేవి విద్యార్థినులకు, మహిళా అధ్యాపకులకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పర్యావరణ కాలుష్యానికి తోడు ఆధునిక జీవన శైలి కూడా నేటి తరంలో క్యాన్సర్ విజృంభించడానికి కారణమవుతోందని తెలిపారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

సీఐటీయూ జిల్లా నాయకులు ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

తెనాలిఅర్బన్: లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను వెంటనే పునఃరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కేబీ ప్రసాద్ డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కార్మికుల కోసం పార్లమెంట్ 44 చట్టాలు చేసిందని గుర్తు చేశారు. వాటిని అమలు చేసిన సమయంలో కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కోవిడ్ వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసిందని ఆరోపించారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తెచ్చిందన్నారు. ఇవి కార్మికులకు ఉరితాళ్లగా మారాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ఎం.వెంకటేశ్వర్లు, యసుధాకర్, ఎం.పద్మా,వెలుగు లక్ష్మీనారాయణ, మంద్రు మరియమ్మ, కంచర్ల సుశీల, వెంకటసుబ్బయ్య, సిహెచ్ శేషగిరిరావు పాల్గొన్నారు.

9న హనుమాన్ చాలీసా పోటీలు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీ శారద సంగీత ఆలయం సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు గౌరావఝల ఆంజనేయశాస్త్రి నిర్వహణలో హనుమాన్ చాలీసా పోటీలను నిర్వహించనున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నెహ్రూ రోడ్డులోని శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత గోవర్ధనస్వామి ఆలయం ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. జూనియర్స్ (5-12 ఏళ్ల బాలబాలికలు), సీనియర్స్ (13-20 ఏళ్ల వయసు కలు) విభాగాలుగా నిర్వహించే ఈ పోటీల్లో రెండేసి విభాగాల్లోని విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతి రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000 అందజేస్తామన్నారు. మరో అయిదుగురికి కన్సొలేషన్ బహుమతులను అందజేస్తారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు హనుమాన్ చాలీసాలోని 40 శ్లోకాలను చూడకుండా పాడాల్సి ఉంటుందని తెలిపారు. విజేతల ఎంపిక అధికారం న్యాయ నిర్ణేతలదేనని స్పష్టం చేశారు. వయసు ధృవీకరణ నిమిత్తం ఆధార్ కార్డుతో రావాలని కోరారు. ఆసక్తిగలవారు 9989035470 నంబరులో పేరు నమోదు చేసుకోవాలని గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, కొండపి శ్రీనివాసరావు వివరించారు.

తెనాలిలో కొనసాగుతున్న ప్రత్యేక సదరం క్యాంప్



క్యాంప్‌కు వచ్చిన వికలాంగులు

తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ప్రతివారం నిర్వహిస్తున్న ప్రత్యేక సదరం క్యాంప్ బుధవారం కొనసాగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సదరం క్యాంప్‌ను అధికారులు నిర్వహించారు. ఈఎన్‌టీ, అప్తామాలజీతో పాటు ఈవారం నుంచి సైక్రాటిక్ విభాగ సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఈఎన్‌టీ విభాగంలో 50 మందిని, అప్తామాలజీ విభాగంలో 44 మంది, సైక్రాటిక్ విభాగంలో 20 మందికి వైద్య పరీక్షలు చేశారు. క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యులు-2, అప్తామాలజీ-2, సెక్రాటిక్-2 వైద్యులు వైద్య సేవలు అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు. గురు, శుక్రవారాలలో కూడా శిబిరం కొనసాతుందని ఆమె చెప్పారు.